# దప్పికయిన సముద్రం

ఎమ్మెస్సార్ మూర్తి



పూర్వం జృంభిణీ స్తంభ దేశాన్ని హిరణ్య సింహుడనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఆ దేశ ప్రజలకు విద్యా వినయాల్లో రెండవది ఎక్కువగా ఉండడం చేత పరిపాలన నిరాటకంగా సాగుతుండేది.

ఆ కాలంలో ఉప్పు ఉత్పత్తి తక్కువగా ఉండేది. ప్రజలు ఉప్పు కోసం ముప్పు తిప్పలు పడుతుండేవారు.

ఓ రోజు మంత్రిగారు ఈ విషయం ప్రస్తావిస్తూ "మహారాజా- మన సైనికులు విప్పసారా లేకపోయినా బ్రతకగలరు. కానీ కనీసం పప్పులోకి ఉప్పు లేకపోవడం వల్ల వారి సంసారాలు చప్పనై పోతున్నాయి. అదను చూసుకుని మన సైనికులు ఎప్పుడోసారి తప్పక తిరగబడే అవకాశం కల్పిస్తూ మనంతట మనమే ముప్పు తెచ్చుకుంటున్నామేమో ఆలోచించాలి" అన్నారు.

"అయితే ఇప్పుడేం చేద్దాం?" అన్నారు మహారాజు.

"ఉప్పు కొనుక్కోడానికి వీలుగా సైనికులకి వేరేగా కొంత వేతనం ఏర్పాటు చేద్దాం" అన్నారు మంత్రి.

'కేవలం సైనికులకేమిటి - పరిపాలనలో వృత్తి చేపట్టిన వారందరికీ ఉప్పు వేతనాలు ప్రకటించండి.'

అలా ఆ మహారాజు ప్రజల మెప్పు పొందారు. రాజుగారి ఉప్పు తిని బ్రతుకుతున్నామన్న కృతజ్ఞతను గొప్పగా చెప్పుకున్నారు. 'ఉప్పు తినడం' అలా విశ్వాసానికి ప్రతీకై పోయింది.

కొన్ని తరాలు కాల గర్భంలో కలిసిపోయాయి. కాలం మారింది.

అదే దేశాన్ని ప్రజలే పాలించే రోజులొచ్చాయి.

అంటే ప్రజలందరూ పాలించలేదు. ప్రజల్లో ధనవంతులు - బీదవారూ, దొరలు - దొంగలు, పండితులు-పామరులు, అక్షరాస్యులు-నిరక్షరాస్యులు... ఇలా ఈ ద్వైతాలలో ఎవరు బలవంతులో, ఎవరికి మందీ మార్బలముందో వారు మిగతా వారి చేత యథావిధిగా ఎన్నికై పరిపాలించారు. అయినా దాన్ని ప్రజా ప్రభుత్వమే అంటూ సందర్భానుసారంగా పాలకులు బాధ్యతను వహిస్తూ వచ్చారు.

కాగా బలాబలాల మూలం ధనమే కనుక పాలన ధనానికి ఆలవాలమైపోయింది. వారు నిరంతర సంపాదనాంతరంగులై రంగ రంగ వైభవంగా తరంగాంత పారంగతులైనారు. నిప్పు పుల్ల దగ్గర్నుండి విప్ప సారా వరకు సుంకాల రూపాల్లో రూపాయలు కోశానికి చేరుతుండేవి.

తరతరాలుగా విప్ప సారా మరిగిన పౌరులు కొంత మంది అప్పు చేయలేక కాపు సారా మరిగారు. అప్పులు ఉప్పెనలా అయిన ఆ కొన్ని కాపురాలు




గుప్పున మండి వికృత రూపం దాల్చి సర్వ రూపాల సారాను ఆపు చేయించారు. తద్వారా సారా మూలంగా వచ్చే సర్వోత్తమ సుంకం తగ్గింది. కోశం శోకమయమైంది.

కాగా ఇతర ధన సాధన వ్యాపారాలు పంపర పరంపరలుగా సాగుతూనే ఉన్నాయి. సకల వ్యాపారాలు ధన బలాధీనమైనవి కావడం చేత ఉత్తరోత్తరాభివృద్ధిరస్తులైన వాటి జోలికి మహారాజు పోలేదు.

ఇక అప్పులు తమకీ తప్పవనే పరిస్థితిలో మంత్రిగారు మహారాజుకు సలహా ఇచ్చారు.

"పూర్వం సూర్యవంశీయులు ఉప్పుకి వేరేగా వేతనాలు ఇచ్చి విశ్వాసపాత్రులైన ఉద్యోగస్తులను ఏర్పరచుకున్నారని శాసనాలలో ఉన్నది ప్రభూ! ఇప్పుడు ఉప్పుకి ఎలాగూ కొదువలేదు, విశ్వాసపాత్రులైన ఆ ఉద్యోగుల వేతనాలు ఎకాయెకి తగ్గించకుండా వృత్తి పన్ను పేరిట కత్తిరించితే తప్ప మన పప్పులు ఉడికేట్టు లేదు ప్రభూ!"

మహారాజు సందేహించి ఇలా అన్నారు "ప్రతి వాడికీ ఏదో ప్రవృత్తి సృష్టిలోనే ఉంటున్నది. దాన్నే వృత్తిగా చేసుకు బ్రతుకుతుంటాడు. నిజానికి నా ప్రవృత్తినే తీసుకో. నేను మహారాజును. నన్ను వృత్తి పన్ను కట్టమనడం...."

"ప్రభువులు క్షమించాలి. మన ప్రవృత్తి పరిపాలనే కాని అది వృత్తికాదు. ఒక వేళ అయినా ప్రభువులే- కోశాధికారులైన ప్రభువులే పన్ను కట్టమనడం హాస్యాస్పదం. కన్ను కంటినే ఎలా చూసుకుంటుంది ప్రభూ?"

"సరే బాగున్నది. విశ్వాసంతోవృత్తి చేసుకుని బ్రతికే వాడిని ఎలా కనిపెట్టడం?"

"అలా కాదు ప్రభూ! ప్రభుత్వం పట్ల విశ్వాసమున్న వారైనా, లేనివారైనా వృత్తి పన్ను కట్టి తీరవలసిందే!"

"మంత్రిగారూ- మన ఉప్పు తిని మన పట్ల విశ్వాసంగా బ్రతికే వారిని ఇలా హింసించడం న్యాయమా?"

"ఇందులో అన్యాయమేమీ లేదు ప్రభూ. ఇది పరమ అహింస."

"విశదీకరించండి-"

"మన పట్ల విశ్వాసం లేని వారికే ఇది హింసగా కనిపిస్తుంది. అయినా అన్యాయం లేదు. ప్రభువుగా మీరు వారిని హింసించడం న్యాయమే. వారూ వాళ్ల తప్పుకు ఓర్పుతో దీన్ని భరిస్తారు. ఇక పోతే మన పట్ల విశ్వాసం ఉన్న వారితో అసలు ఏమీ ఇబ్బంది లేదు. మనం ఏమి చెప్పినా మూఢ భక్తితో నమ్ముతారు."

"ఇపుడు ఏమి చెప్పాలి?"

"ఒకప్పుడు ఉప్పు తిని బ్రతికిన వారు కాబట్టి తప్పక నమ్ముతారు. సముద్రానికి దప్పికయింది అని టూకీగా చెప్పేద్దాం." ●